# బేరం-స్థాయి

వసుంధర

ప్రసిద్ధ నిర్మాత చెంచురామయ్య నుంచి రచయిత జగన్నాథానికి పిలుపు వచ్చింది.

జగన్నాథం రచనల ద్వారా పేరు సంపాదించుకున్నంతగా డబ్బు సంపాదించ లేదు. అతడి రచనల్లో వాస్తవికత ఎక్కువగా ప్రతిబింబిస్తుంది. అయితే అతడి రచనల్లో సినిమా ఎలిమెంటు ఎక్కువగా ఉంటుందని అతడి అభిమానులంటూంటారు. అతడి కథలు సినిమాలుగా వచ్చిన రోజున మన చలన చిత్ర పరిశ్రమకు పట్టిన భావ దారిద్ర్యం తొలగి పోతుందని కొందరు విమర్శకులు కూడా అన్నారు. జగన్నాథం వయసులో బాగా చిన్నవాడు కావడం వల్ల అతడికి రచయితగా చక్కటి భవిష్యత్తుందని చాలా మంది అనుకుంటున్నారు.

ఇలాంటి సమయంలో జగన్నాథానికి చెంచు రామయ్య నించి పిలుపు వచ్చింది.

జగన్నాథానిది ప్రభుత్వోద్యోగం. అందువల్లనే అతడు విరివిగా కథలు రాయ గలుగుతున్నాడని కొందరంటారు. అతడి నెల జీతం పదహారు వందలు. అది మామూలుగా అయితే ఫరవాలేదు. అతడికి తల్లిదండ్రుల ద్వారా వచ్చిన బాధ్యత లున్నాయి. నెలకు కనీసం రెండు వేల రూపాయల ఖర్చుంటుందతడికి. ఆపైన ఓ సినిమా చూడాలన్నా, టీ. వీ. కొనాలన్నా, ఖరీదైన బట్టలు కావాలన్నా, భార్యకు నగ చేయించాలన్నా వేరే డబ్బు కావాలి. జగన్నాథానికి రచనలమీద వచ్చే డబ్బు కలిపినా ఈ ఖర్చు లన్నింటికీ సరిపోవడం లేదు. అందుకే అతడు విరివిగా రచనలు చేస్తున్నాడని కొందరనుకుంటారు.

ఏ రచయితా యిలాంటి కారణాల వల్ల రచనలు చేయడు. ఆలోచించే మనసుకి స్పందించే హృదయం తోడైతే కలం పలుకుతుంది. అలాంటప్పుడు రచయిత ఎవరూ అడక్కుండానే రచనలు చేస్తాడు. అడక్కుండా పాడే కోయిలకు కవుల పొగడ్తలు మాత్రమే లభించినట్లే- అడక్కుండా రచనలు చేసే వాడికీ విమర్శల అభినందనలు మాత్రమే లభిస్తాయి.

"సినిమాలకు రాయి, బాగా డబ్బొస్తుంది"- అని హితులు, సన్నిహితులు అతడికి హిత బోధ చేశారు.

"రాయడానికి నాకేమీ అభ్యంతరం లేదు. ఆ అర్హత నాకుంటే సినీరంగం నుంచి నాకు పిలుపు రావాలి గదా!" అన్నాడు జగన్నాథం వారితో.

"పిలుపు రావాలంటే ప్రయత్నం చేయాలి"- అన్నారు వాళ్ళు.

ప్రయత్నమంటే వారి అభిప్రాయం వేరు. జగన్నాథం మాత్రం ప్రయత్న మంటే ఇంకా మంచి కథలు వ్రాయడమనుకున్నాడు. ఇతర విధమైన ప్రయత్నా లేమీ లేకుండానే అతడికి చెంచు రామయ్య నుంచి పిలుపు వచ్చింది.

సినీ కథలకు తెలుగులో యాభైవేల దాకా పారితోషిక ముంటుందని జగన్నాథం భార్య నిర్మల విని ఉంది. భర్తకు చెంచు రామయ్య పిలుపు రాగానే ఒక్కసారిగా ఆమెలో కోరికలు పురివిప్పాయి.

"యాభై వేలకు ఒక్క పైన కూడా తగ్గకండి- అసలే మీరు మొహమాటస్థులు....." అంది నిర్మల.

"పత్రికలో ప్రచురించ బడిన కథకు పారితోషికం నూర్రూపాయలు. దానికి సినిమా వాళ్ళు వెయ్యి రూపాయ లిచ్చినా చాలుగదా" అన్నాడు జగన్నాథం.

"ఇలాంటి ఆలోచనలే మిమ్మల్ని పైకి రానివ్వడం లేదు. స్టేజి మీద నాటకానికి అయిదు వందలు తీసుకునే హీరో సినిమాలో వేస్తే అయిదు లక్షలు తీసుకుంటున్నాడు. అది డబ్బు ప్రపంచం. డబ్బడిగిన వాడికే విలు వుంటుంది-" అంది నిర్మల అన్నీ తెలిసిన ఆరిందాలా.

"డబ్బును బట్టి కాదు విలువ. విలువను బట్టి డబ్బు"-

"ఇలాంటి వితండ వాదనలు కట్టిపెట్టి కాస్త ఒంకంగా ఉండండి. యాభై వేలకు ఒక్క పైసా తగ్గనని అంది- అంది నిర్మల.

"చెంచు రామయ్య నా కథకు బాగా తక్కువిస్తానంటే ఏం చేయమంటావు? వద్దని వచ్చేయనా-" ముందే చెప్పు- అన్నాడు జగన్నాథం.

"ఆ పని మాత్రం చేయకండి. ఎలాగో అలా బాగా బేరం ఆడి సెటిల్ చేసుకుని రండి"- అంది నిర్మల.

జగన్నాథం చెంచురామయ్యను కలుసుకున్నాడు.

చెంచు రామయ్య జగన్నాథానికి సకల మర్యాదలూ చేసి- "మీ కథ నాకు చాలా నచ్చింది. సినిమాగా తీయాలని పించింది. అయితే మీ కథలో సినిమా ఎలిమెంటు లేదు. సినిమాకు అనుగుణంగా దాన్ని మార్చడానికి ఎంతో శ్రమ పడాలి. ఆపైన లక్షల పెట్టుబడితో రిస్కు తీసుకోవాలి. కానీ ఆ కథ మీద నాకున్న అభిమానంతో అన్నింటికీ సిద్ధ పడ్డాను-" అన్నాడు.

"చాలా సంతోషం-" అన్నాడు జగన్నాథం.

"ఎంతిమ్మంటారు?" అన్నాడు చెంచురామయ్య సూటిగా.

జగన్నాథానికి ఏమనాలో తెలియలేదు. చెంచురామయ్య మాటలు విన్నాడు. ఏభై వేలు అడగడానికి మొహమాటంవేసింది. ఎంతడగాలో తెలియక "అంతా మీకే తెలుసు-" అన్నాడు.

"సినిమాల్లో కథకు మేము యాభై వేల దాకా యిస్తాం. అయితే వాళ్ళు ప్రొఫెషనల్ రైటర్స్. కథను సినిమాకు అనుగుణంగా మార్చే శ్రమ వాళ్ళే తీసుకొంటారు. ఆ శ్రమకే మేము డబ్బిచ్చేది. లేకపోతే అధమ నాలుగైదు వేలకు మించి యివ్వక్కర్లేదు. ఇప్పుడు మీ కథను కూడా నేను ప్రొఫెషనల్ రైటరు చేతిలో పెట్టి ఏభై వేలూ ఖర్చు పెట్టాలి. ముందు మీకెంతిమ్మంటారో చెప్పండి..." అన్నాడు చెంచురామయ్య.

తన కథకు నాలుగైదు వేల కంటే రాదని జగన్నాథానికి అర్థమైపోయింది. భార్య ఏమంటుందో నన్న భయం తప్పితే- జగన్నాథానికి అది పెద్ద మొత్తం లాగే ఉంది. అతడు చెంచురామయ్య ఇష్టానికే అన్నీ వదిలి పెట్టే యాలనుకున్నాడు. ఆ సమయంలో హీరో నుంచి ఫోన్ వచ్చింది చెంచురామయ్యకు. ఫోన్ చేసింది హీరో కాదు. అతడి సెక్రటరీ.

"కాల్ షీట్ల అడ్జస్టుమెంటు చాలా కష్టం. ఎలాగో ప్రయత్నిస్తాం కానీ ఈ చిత్రానికి పారితోషికం ఓ లక్ష పెంచాలి" అన్నాడు సెక్రటరీ.

"ఎప్పుడూ ఆయన్నే బుక్ చేస్తున్నాను. నాకే రేటు పెంచితే ఎలా?" అన్నాడు చెంచురామయ్య.

"మీ క్కాబట్టే లక్ష. కొత్త వాళ్ళందరికీ రెండు లక్షలు....."

చెంచురామయ్య బేరం మొదలు పెట్టాడు. జగన్నాథానికిద్దరి సంభాషణా వినపడుతూనే ఉంది. చివరికి బేరం 96 వేలకు సెటిలయింది. అది హీరో

లక్కీ నంబరుట.

ఈ బేరం చూడగానే జగన్నాథం కడుపు మండింది. చూస్తూండగా చెంచురామయ్య హీరోకు సుమారు లక్ష రూపాయలు పెంచాడు. తన దాకా వచ్చేసరికి నాలుగూ అయిదూ వేలంటున్నాడు. నిర్మల చెప్పింది నిజం ఇది డబ్బు ప్రపంచం.

"చూశారుగా మా అవస్థ! ప్రతివాళ్ళూ మమ్మల్నేదో చేయాలని చూసేవాళ్ళే-" అంటూ చెంచురామయ్య సానుభూతి కోసం జగన్నాథం వంక చూశాడు.

జగన్నాథానికి సానుభూతి కలగలేదు- "నీది మాత్రంతక్కువ దో పిడీయా? నావంటి అమాయకుల్ని దోస్తున్నావు......" అనుకున్నాడతడు.

అందుకే అతను తన కథకు కనీసం పది వేలు కావాలన్నాడు. చెంచురామయ్య ఓ పట్టాన ఒప్పుకోలేదు- అయిదు వేలకు మించి ఇవ్వడానికి!

తను సినిమా తీస్తే జగన్నాథానికి రచయితగా పేరొస్తుందన్నాడు. అప్పుడందరూ అతడి కథకు యాభై వేలేమిటి- లక్ష కూడా ఇవ్వచ్చున్నాడు.

జగన్నాథం దిగి రాలేదు.

"సరే- హీరో కాల్ షీట్లు కూడా దొరికిపోయాయి కాబట్టి ఎంతో కొంతకు ఒప్పుకోక తప్పదు. హీరోతో బేరం కుదరలేదనీ- అదనంగా లక్ష యిచ్చాననీ అనుకుంటాను. ఆ నాలుగు వేలూ కలిపి- మొత్తం తొమ్మిది వేలూ యిస్తాను. అందరి నిర్మాతల్లా డబ్బు కోసం తిప్పకుండా ఇప్పుడే వెంటనే యిచ్చి అగ్రిమెంటు రాయించుకుంటాను. తొమ్మిది నా లక్కీ నంబరు. కాదనకండి...." అన్నాడు చెంచురామయ్య.



జగన్నాథం ఇంకేమీ అనలేకపోయాడు. అతడు అగ్రిమెంటు రాసి- తొమ్మిది వేలు తీసుకుని ఇల్లు చేరుకుని భార్యకు జరిగింది చెప్పాడు.

నిర్మల ముందు భర్తనే తిట్టి పోసింది. తర్వాత నిర్మాత గురించి "అన్ని లక్షలు ఖర్చు పెట్టేవాడు మన దాకా వచ్చేసరికి వెయ్యి రూపాయలకు కక్కుర్తి పడ్డాడు- మీరైనా అడిగింది పది వేలే కదా- ఇరవై అడిగారా, పాతికడిగారా?" అంది.

"ఏమనుకుని ఏం లాభం? ఈ అనుభవంతో మున్ముందు జాగ్రత్తగా ఉందాం. ముందు డబ్బు లెక్క పెట్టు. ఇంత డబ్బు చూస్తుంటే వళ్ళంతా వణికింది. లెక్క పెడుతూంటే చేతులు వణికాయి. బుద్ధి సరిగ్గా పని చేయలేదు. నువ్వోసారి లెక్క పెట్టు....." అన్నాడు జగన్నాథం.

ఎవరి కెన్ని శాపనార్థాలు పెట్టినా- డబ్బు చూడగానే నిర్మల అన్నీ మర్చిపోయింది. ఒక్కసారిగా తొమ్మిది వేలంటే ఆ దంపతులకి మామూలు విషయం కాదు.

నిర్మల డబ్బు లెక్క పెట్టింది. డబ్బు సరిగ్గానే ఉంది.

"ఏమండీ- ఈ రోజే వెళ్ళి పట్టు చీర కొనుక్కుందాం....." అందామె.

నిర్మలకు చీర కొనుక్కోమని తలిదండ్రులు - రెండు వందల రూపాయలు పంపారు ఏడాది క్రితం. అవామె భర్తకే యిచ్చేసింది. జగన్నాథం ఆ డబ్బు అవసరానికి వాడుకుని- భార్యకు పట్టు చీర కొనిపెడతానని మాటిచ్చాడు. ఈ రోజు దాకా ఆ మాట నిలబెట్టుకునే అవకాశం రాలేదు.

"డబ్బంతా వృథా చేయవద్దు. ఏ నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ కొంటే పన్నెండు శాతం వడ్డీ వస్తుంది. ఆ వడ్డీతో ఏటా కొన్ని ఖర్చులు వెళ్ళిపోతాయి. పట్టు చీర మాత్రం తప్పనిసరిగా కొందాం-!" అన్నాడు జగన్నాథం.

ఇద్దరూ అప్పటికప్పుడు బయల్దేరి బజార్లో పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన బట్టల దుకాణానికి వెళ్ళారు. అక్కడ చాలా సేపు చూసేక - భార్యాభర్తలిద్దరికీ ఓ చీర నచ్చింది. దాని ఖరీదు

## వేమన పద్యాలు

## మోసగాడు




కాని వాని చేత కాసు వీసంబిచ్చి
వెంట దిరుగువాడు వెఱ్ఱివాడు
పిల్లి తిన్న కోడి పిలిచినా పలుకునా
విశ్వదాభిరామ వినుర వేమ.

## బేరం-స్థాయి

300 మాత్రం. అంత మంచి పట్టు చీర మూడు వందలకే వస్తున్నందుకు వారెంతో సంతోషించారు కూడా! అయితే కౌంటర్లో బిల్లు వేసే వ్యక్తి ఎనిమిది వందలని వేశాడు.

"దీని ధర మూడు వందలే కదా!" అన్నాడు జగన్నాథం.

"కాదు సార్- అసలుసిసలు కంచి పట్టుచీర. మూడు వందలకెలా వస్తుంది? ఇది ఎనిమిది వందలు...." అనాడతడు.

"కానీ సేల్సుమన్ అలా చెప్పాడే?"

క్యాషియర్ సేల్సుమన్‌కి కబురు పెట్టాడు. సేల్సుమన్ వణికిపోతూ- "చీరకు అంటించిన కాగితం మీద అంకె చూసి చెప్పాను సర్!" అన్నాడు.

చీర మీద వేసిన అంకె ఎనిమిదో, మూడో తెలియకుండా ఉంది. చెప్పాలంటే అది మూడు లాగే ఉంది. అనుమానిస్తే మాత్రం ఎనిమిదనిపిస్తుంది.

"సేల్సుమన్ కొత్త! ఏమీ అనుకోకండి సార్- పొరపాటు మాదే..." అని- "ఒరేయ్ వీళ్ళకి మూడు వందల్లో చీప్‌రకం పట్టుచీరలు చూపించు.." అన్నాడు క్యాషియర్.

మామూలుగా అయితే జగన్నాథం ఆ మాటలకు పొరుషపడేవాడు కాదు కానీ ఇప్పుడు జేబులో డబ్బుంది. అందుకని బింకంగా "డబ్బు కోసం కాదు మాట తేడా వచ్చిందని... మాకీ చీర నచ్చింది. కానీ....." అని ఆగాడు.

క్యాషియర్ స్వరం తగ్గించి- "సార్- పొరపాటు మాది కాబట్టి మీకు కొంత కన్సెషనిస్తాను. ప్రస్తుతం పట్టుచీరల మీద అయిదు శాతం డిస్కౌంట్ ఇస్తున్నాం, కానీ మీకీచీర ఏడు వందలకే యిస్తాం...." అన్నాడు.

అప్పుడు జగన్నాథానికి చెంచురామయ్యతో బేరం గుర్తొచ్చి- "తొమ్మిది నాకు లక్కీ నెంబరు. కాబట్టి ఆరు వందల డెబ్భై అయిదుకిస్తే ఈ చీర తీసుకుంటాను. లేకపోతే అక్కర్లేదు-" అన్నాడతడు క్యాషియర్‌తో. అన్ని అంకెలూ కలిపితే తొమ్మిది రావడానికి క్యాషియర్ రకరకాల అంకెల కాంబినేషన్సు సూచించి చివరకు, జగన్నాథం చెప్పిందానికి ఒప్పుకున్నాడు.

"ఈ చీర మీకు మాత్రమే ఈ ధరకిస్తున్నాను. ఇంకెవరికీ ఈ ధర చెప్పకండి సార్- బిల్లు కూడా ఎనిమిది వందలకే రాస్తున్నాను-" అన్నాడు క్యాషియర్.

అక్కణ్నించి బైటకు వస్తూ- "ఖరీదైన చీరలమ్మేటందుకు షాపు వాళ్ళు వేసే ఎత్తులివి. లేకపోతే ఎనిమిది వందల రూపాయల చీర అంత తేలికగా అమ్ముడుపోదు. ముందు తక్కువ ధర చెప్పడం- తరవాత పొరపాటనడం- ఒకసారి నచ్చిన చీరను మనం కాదనలేకపోవడం -దీని అసలు ఖరీదే అయిదొందలో ఆరొందలో ఉంటుంది. కానీ ఏం చేస్తాం- తప్పదు-" అన్నాడు భార్యతో.

"ధర దేముంది? చీర నాకు బాగా నచ్చింది" అంది నిర్మల.

జగన్నాథం రిక్షాను పిలిచాడు. ఎక్కడికి వెళ్ళాలో వినగానే అయిదు రూపాయలడిగాడు రిక్షావాడు.

"వచ్చేటప్పుడు రెండ్రూపాయలకు వచ్చాం-" అంటూ ఓ రూపాయి తగ్గించి అబద్ధం చెప్పాడు జగన్నాథం.

"రెండ్రూపాయల కెవరొస్తారు బాబూ- మామూలుగా అయితే మూడు రూపాయలు బాబూ! బజారుకి షాపింగుకి వచ్చారు. పేదవాణ్ణి- నాకో రెండ్రూపాయలు సంతోషంగా యివ్వలేరా?" అన్నాడు రిక్షావాడు.

జగన్నాథం బేరమాడబోయి ఆగిపోయాడు. ఆరువందల డెబ్భై అయిదు పెట్టి పట్టుచీర కొన్నాడు తను. అందులో ఎంత మోసపోయాడో తెలియదు కానీ అందుకు రవంత బాధ కూడా పడడం లేదు. రిక్షావాడికి- ఒకటి రెండు రూపాయలివ్వడానికి బేరమాడుతున్నాడు. చెంచురామయ్యకూ తనకూ తేడా ఏముంది- బేరం మొత్తం స్థాయిలో తప్ప! □